క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్(పీటీజీ) ప్రిన్సిపాల్‌గా కె.సురేష్ బుధవారం విధుల్లో చేరారు. భామిని ఈఎంఆర్ఎస్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆయన భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్‌కు బదిలీపై వచ్చారు. ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన డి.భారతి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు.

రక్షిత పథకం ప్రారంభం



రక్షిత పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత పథకాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. గ్రామస్తుల తాగు నీటి అవసరాలు తీర్చేందుకు రూ.3 లక్షలతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భరత్‌చంద్ర ఉన్నారు.

ఎమ్మెల్యేకు సీఆర్టీల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీలు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పోస్టుల నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా విధులు నిర్వహించిన 1284 మందికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పలువురు సీఆర్టీలు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని ఆమె స్వగృహంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కటాఫ్ డేట్ ప్రకటించి 02.06.2014కు ముందు నుంచి సీఆర్టీలుగా విధులు నిర్వర్తించిన వారందరినీ రెగ్యులర్ ఉద్యోగులుగా చేసిందన్నారు. అయితే 03.06.2014 తర్వాత నుంచి తామంతా సీఆర్టీలుగా ఆయా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ పోస్టుల్లో నుంచి సీఆర్టీలకు (తమ పోస్టులను) మినహాయింపునిస్తూ, అందర్నీ రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. ఈ ఉద్యోగం కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సీఆర్టీల వినతిని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

దోమల నివారణ మందు పిచికారీ

భామిని: మండలంలోని పాలవలసలో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. రవీంద్ర ఆధ్వర్యంలో దోమల నివారణమందు బుధవారం పిచికారీ చేశారు. అలాగే దోమలు వృద్ధి చెందకుండా మురుగునీరు తొలగింపు, పారిశుధ్య పనులు చేయించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. కార్యక్రమంలో మలేరియా నివారణసబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, బత్తిలి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు

● వర్షం కురవడంతో రైతన్నల ఆనందం



భామిని: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: వరుణుడిపై నమ్మకంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఇటీవల దుక్కులు చేపట్టి వరి వంగడాలను వెదలు చల్లారు. గడిచిన వారం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వేసిన విత్తనాలు పాడయ్యే ప్రమాదం ఉందని బాధపడ్డారు. ఈసమయంలో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. వెదలు జల్లిన వంగడాలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు సార్లు వర్షం కురిస్తే విత్తనాలు మొలకెత్తుతాయని చెబుతున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు కూడా ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

విస్తారంగా వానలు

భామిని: మండల పరిధిలో బుధవారం విస్తారంగా వానలు కురిశాయి. కొద్ది రోజులుగా వర్షాలకు ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరట కలిగించింది. ఇప్పటికే వెదజల్లిన వరి విత్తనాలు, నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తడానికి వర్షం సహకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీతంపేట: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు



వీరఘట్టం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్



గరుగుబిల్లి: ర్యాలీలో పాల్గొన్న ఎస్సై అమ్మన్నరావు



కురుపాం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు, విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్విన్‌పేట పోలీసులు

ప్రాణాంతకం

మత్తు పదార్థాల వినియోగం



జియ్యమ్మవలస: చినమేరంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

పాలకొండ రూరల్ : మత్తు పదార్థాల వాడకం ప్రాణాంతకమని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నిషేధిత దినం సందర్భంగా రసాయనశాస్త్ర విభాగం నేతృత్వంలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత దురలవాట్లకు బానిసైతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల శరీరంలో ఏర్పడే పరిణామాలపై స్థానిక ఏరియా ఆస్పత్రి ఫార్మాసిస్టు టి. హృదయానందకుమార్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, శ్రీనివాసరావు, జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

● **అవగాహన పెంచుకోవాలి**

పాలకొండ: మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై యువత అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ కృష్ణారావు సూచించారు. ప్రపంచ మాధకద్రవ్య నిరోధక దినం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్య రహిత దేశంగా భారత్ ఉండాలన్నారు. ఆయనతో పాటుగా సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● **డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి..**

సీతంపేట: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిస్తూ పట్టణంలో పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ పార్కు నుంచి సంత వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీతంపేట, దోనుబాయి ఎస్సైలు జగదీష్‌నాయుడు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

● **డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం**

వీరఘట్టం: డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణానికి విద్యార్థుల సహకారం ఎంతో అవసరమని ఎస్సై కళాధర్ అన్నారు. స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది అని తెలిపారు. ఈ దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **గరుగుబిల్లి:** మద్యం, గంజాయి, జూదం తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతం అంటూ నినాదాలు చేశారు. చెడు వ్యసనాల వల్ల యువత ఏరకంగా చెడిపోతున్నారో వివరించారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.

● **కొమరాడ:** మారకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్సై నీలకంఠం అన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రావ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు అలవాటుపడి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన జీవనానికి అనుసరించాల్సిన మార్గాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు

● **కురుపాం:** మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని కురుపాం ఎస్ఈబీ సీఐ జోగమ్మ యువతకు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. బాగా చదివితే జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడవచ్చన్నారు. అనంతరం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● **గుమ్మలక్ష్మీపురం:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలని ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ అన్నారు. ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు వాడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల బారిన పడి ఆరోగ్యాల్ని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట, కురుపాం ఎస్సైలు బి.శివప్రసాద్, ఎస్.షన్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు



కొమరాడ: మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నీలకంఠం

● **జియ్యమ్మవలస:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో చినమేరంగి సీఐ మంగరాజు, ప్రిన్సిపాల్ సవరపు రవణ, అధ్యాపకులు వీకేజీ రాణా, సురేష్, నగేష్, తేజ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

● డీఈఓ పగడాలమ్మ



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

భామిని: విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, పసుకుడి ఎంపీపీ స్కూల్, ఏపీ మోడల్ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. వాతావరణం మారుతున్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఇటీవల పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే స్టూడెంట్ కిట్లు, యూనిఫారాల పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ప్రిన్స్‌పాల్ శివకుమార్, ప్రమీల, హెచ్‌ఎంలు కె. వెంకటరావు, బిడ్డికి ప్రసాదరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ



జియ్యమ్మవలస: జెడ్పీటీసీ శశికళాదేవిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మధుసూదనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

కొమరాడ: మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) శెట్టి శ్యామల భర్త డాక్టర్ శెట్టి మధుసూదనరావు ఈ నెల 22న గుండెపోటుతో మృతి చెందారు. ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుసూదనరావు మృతికి సంతాపం తెలియజేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్మన్ వెంట పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజింగి జోగారావు, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, ఎస్ఆర్ఐ సీఈఓ తుమరాడ చంద్రమౌళీశ్వరరావు, పప్పల గోపాలకృష్ణ, తదితరులు పాల్గున్నారు.

జియ్యమ్మవలస: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. గౌరీశంకరరావు మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని భార్య శశికళాదేవి జెడ్పీటీసీ సభ్యునిగా ఉన్నారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా..

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం: జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరై వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా నిమ్మలపాడు గ్రామస్తులకు గత మూడేళ్లగా జనన, మరణ ధ్రువపత్రాలు అందడం లేదని బిత్రపాడు సర్పంచ్ శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలకు బాసంగి పాఠశాలలోకి నీరు కారుతోందని, కొత్త భవనాలు నిర్మించాలని గ్రామ సర్పంచ్ కోరారు.

వైఎస్సార్‌సీపీ సభ్యులు బాయ్‌కట్

ఎంపీపీ బొంగు సురేష్ ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడాన్ని, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లే వాహనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని వైఎస్సార్‌సీపీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో 12వ జనరల్ బాడీ మీటింగ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మర్రాపు లక్ష్మునాయుడు, మజ్జి అన్నపూర్ణమ్మ, సర్పంచులు కొల్లి సత్యంనాయుడు, కోట రమేష్ ఉన్నారు.

హ్యాండ్‌వాష్‌పై అవగాహన



చేతులు కడగడంపై అవగాహన కలిపిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

సీతంపేట: మండలంలోని సోమగండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు హ్యాండ్‌వాష్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె. గీతాంజలి మాట్లాడుతూ, నీరు కలుషితం కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సింహాచలం, సీడీపీఓ రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

సీతంపేట: కొండశిఖర గ్రామమైన బిడింది గూడ సమీపంలో ఆటో బోల్తా పడి పలువురు గాయపడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు పాలకొండ నుంచి ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి.

బాలల హక్కులపై ప్రచారం



బిల్లుమడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ బృందం

భామిని: మండలంలోని బిల్లుమడ, బత్తిలిలో బాలల హక్కులపై బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఎస్ఓలు జ్యోతిలక్ష్మి, సబితా పట్నాయక్ సారథ్యంలో జరిగిన ర్యాలీలో కళాజాత బృంద సభ్యులు, చిన్నారులు బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్‌లపై వివరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ సిర్ల జయరాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి

● ఎంఈఓలు శ్రీనివాస్, భాస్కరరావు



లావణ్యకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఏఐఎం ప్రతినిధులు, ఎంఈఓలు

భామిని: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాస్, వి. భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏఐఎం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గురుగుబిల్లి లావణ్యను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రణాళికా ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు.కార్యక్రమంలో ఏఐఎం సంస్థ కన్వీనర్ ఎం. ప్రఫుల్లకుమార్, ఆప్తాలిమిస్ట్ ఇప్పలి జానకిరామయ్యలు, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఆర్‌టీయూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామదేవత పండగ

కురుపాం: మండల కేంద్రంలోని పైడిమారమ్మ గ్రామదేవత పండగ బుధవారంతో ముగిసింది. వర్షాలు సకాలంలో పడాలని, పంటలు బాగా పండాలని, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ గ్రామస్తులు మంగళవారం అమ్మవారికి చీరలు, సారెలు చూపించి మొక్కులు చెల్లించారు. బుధవారం అంపకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి మేళతాళాలతో పైడిమారమ్మతల్లి ఘటాన్ని కురుపాం తిరువీధుల్లో ఊరేగించారు.

నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సమావేశంలో మట్లాడుతున్న విక్రాంత్

పాలకొండ : నగర పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం పాలకవర్గం నిత్యం పనిచేయాలని సూచించారు. అధికారులతో సమన్వయం ఏర్పరచుకుని ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. చైర్మన్ యందవ రాధాకుమారి మాట్లాడుతూ.. తాగునీరు, పారిశుధ్యం మెరుగుపడేందుకు అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ సర్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పక్కాగా పింఛన్ల పంపిణీ



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది అందిస్తున్న సేవలతో పాటు ఇకపై పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని 22 సచివాలయాల వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులతో బుధవారం స్థానిక మండల పరిషత్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హత గల ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా రానున్న ఒకటో తేదిన అందించాల్సిన సామాజిక పింఛన్లపై దిశా నిర్దేశం చేశారు. సచివాయాలకు వచ్చే ప్రజలు, అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

నిరుద్యోగ యువతపై ప్రభుత్వం కక్షసాధింపు



గోరిశెట్టి గిరిబాబు

గుమ్మలక్ష్మీపురం: మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించడంతో పాటు నిరుద్యోగులైన యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన 'ఇంటింటికీ రేషన్ పంపిణీ' వాహనాలు(ఎండీయూ వాహనాలు)ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు విమర్శించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టిందని, దీంతో ఐదేళ్లుగా సొంతూరులో ప్రజాసేవ చేస్తూ ఉపాధి పొందిన నిరుద్యోగ యువత ఏం చేయాలో తోచక అయోమయంలో పడ్డారన్నారు. అంతటితో ఆగక ఎండీయూ వాహనాలు నడుపుతూ ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్న వారిని తొలగించి వారిని రోడ్డున పడేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిన సేవలను ఈ ప్రభుత్వం దూరం చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దీనికి కుటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

అలసత్వం వద్దు..



పాలకొండ రూరల్: అన్నవరంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి, తదితరులు

పాలకొండ రూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదని మండల ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నవరం, అంపిలి, గోపాలపురం గ్రామాల్లో పర్యటించి, పారిశుధ్య నిర్వహణపై తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాల పనితీరుపై ఎంపీడీఓ ఎస్.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో వ్యవహరించాలి

● ఆర్డీఓ పీవీ రమణ



ఇరువర్గాల వారితో చర్చిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ, పలు శాఖల అధికారులు

పాలకొండ రూరల్: చర్చి నిర్వహణలో సమన్వయంతో వ్యవహరిస్తూ పాలనపరమైన వ్యవహారాలను సామరస్యపూర్వక వాతావరణంలో కొనసాగించుకోవాలని పాలకొండ ఆర్డీఓ వీవీ.రమణ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో వీరఘట్టం మండల కేంద్రం డౌన్ స్ట్రీట్‌కు చెందిన చర్చి సమస్యను డీఎస్పీ జీవీ. కృష్ణారావు సమక్షంలో పరిష్కరించారు. ఈ క్రమంలో చర్చికి సంబంధించిన రెండువర్గాల ప్రతినిధులు కలింగ ప్రేమభూషణరావు, జాకబ్ దయానందంలతో అధికారులు మాట్లాడారు. ఐకమత్యంతో ఇరువర్గాలు చర్చిలో ప్రార్థనలు జరుపుకోవాలన్నారు. శాంతిభద్రలతకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ఇరువర్గాలు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వీరఘట్టం తహసీల్దార్ కె.జయప్రకాష్, సీఐ మీసాల చంద్రమౌళి, ఎస్సైలు ఎన్.ప్రశాంత్‌కుమార్, జి.కళాధర్ తదితరులున్నారు.